సాక్షి
గుంటూరు
శుక్రవారం । 5 । మే । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.



ఓపీ సేవలు మూడు రోజులే

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ వైద్య విభాగంలో ఓపీ రోగులకు సోమ, బుధవారం, శుక్రవారం రోజుల్లో మాత్రమే సేవలు అందిస్తామని అధికారులు తెలిపారు.

13న జాతీయ మెగా లోక్ అదాలత్



నగరంపాలెం: జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగనుందని జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ గురువారం తెలిపారు. లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోవిడ్- 19, ఎక్సైజ్ కేసులను కూడా త్వరిత గతిన పరిష్కారమయ్యేలా చూడాలని తెలిపారు.

న్యూస్‌రీల్

యార్డులో 98,908 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు గురువారం 93,186 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 98,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,200 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,179 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న మద్దతు ధర రూ.1962



గుంటూరు వెస్ట్: 2022-23 రబీ సీజన్లో పండించిన మొక్కజొన్నకు క్వింటాకు మద్దతు ధర రూ.1962 అందజేస్తున్నారని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా శుక్రవారం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. మొక్కజొన్న విక్రయించాలనుకునే రైతులు సమీపంలోని ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవడంతోపాటు శాంపిల్స్ తీసుకు వచ్చి పరిశీలించుకోవాలన్నారు. మద్దతు ధరను పొందగోరే రైతులు ఈ నెల 12లోపే తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

8న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

తెనాలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8వ తేదీన 'అప్రెంటిస్-రోజ్‌గార్ మేళా' నిర్వహించనున్నారు. సుమారు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనే అప్రెంటిస్ మేళాలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజిలో వివిధ ట్రేడుల్లో శిక్షణ పొంది, సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు పాల్గొనవచ్చని ఐటీఐ ప్రిన్సిపాల్/ జిల్లా కన్వీనర్ రావి చిన్నవెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటా, విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఆరోజు ఉయం 10 గంటలకు తెనాలి ఐటీఐ ప్రాంగణంలో హాజరుకావాలని కోరా రు. మరిన్ని వివరాలకు 9959828100, 9985614465 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు.

నేడు త్రికోటేశ్వరునికి లక్ష మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేమూరి గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షములను పొందాలని తెలిపారు. అదే విధంగా పౌర్ణమి సందర్భంగా ఉదయం గిరిప్రదక్షణ వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదాలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.00 అడుగుల వద్ద ఉంది. ఇది 152.8470 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,350 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 807.10 అడుగుల వద్ద ఉంది. ఇది 32.6499 టీఎంసీలకు సమానం.

'నీట్'..రూల్స్ టైట్

- 7న జాతీయస్థాయి వైద్య విద్య కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష
- గుంటూరు జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 5,068 మంది విద్యార్థులు
- విద్యార్థుల డ్రెస్ కోడ్‌పై ఆంక్షలు
- ముక్కుపుడకలు, చెవిదిద్దులు, చేతులకు వాచీలు ఉంటే నో ఎంట్రీ
- మధ్యాహ్నం 1.30 తరువాత ప్రవేశం లేదు



గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం జరగనున్న జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు కఠిన నిబంధనలు అమలు కానున్నాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల పరిధిలో 5,068 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాల వద్ద ఎన్‌టీఏ నిబంధనల మేరకు ప్రతి ఒక్క విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉండటంతో విద్యార్థులు కనీసం రెండు గంటల ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. మధ్యాహ్నం 1.30 తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని పరీక్షను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. నీట్ దరఖాస్తు సమయంలో విద్యార్థులకు అందజేసిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌లో పొందుపర్చిన నియమావళిని విధిగా పాటించాల్సి ఉంది. 3 గంటల 20 నిమిషాలపాటు పరీక్ష జరగనుంది. గుంటూరు నగర, రూరల్ పరిధితో పాటు తాడికొండ, తుళ్లూరు, పొన్నూరు, సత్తెనపల్లిలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ముక్కు పుడకతో వచ్చినా అనుమతి నిరాకరణ

- నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల వస్త్రధారణపై ఎన్‌టీఏ కఠినమైన ఆంక్షలు విధించింది. విద్యార్థినులు ముక్కుపుడక సహా చెవులకు దిద్దులు, చేతులకు గాజులతో పాటు ఎటువంటి ఆభరణాలను ధరించరాదు.
- చేతికి స్మార్ట్, సాధారణ వాచీలను సైతం ధరించకూడదు. సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల్లోని రూంలలో గడియారాలను ఏర్పాటు చేస్తున్నారు.
- విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు వంటి వస్త్రాలను ధరించకుండా, సాధారణ దుస్తుల్లోనే రావాల్సి ఉంది.
- తలకు టోపీ, కళ్లకు బ్లాక్ సన్ గ్లాసెస్ ధరించకూడదు.
- బ్లూటూత్ వాచీలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ బ్యాండ్లు, పెన్నులు సహా ఇతర ఎటువంటి వస్తువులను విద్యార్థులు తమ వెంట తీసుకురాకూడదు. ఎన్‌టీఏ నిబంధనలను తూచా తప్పకుండా పాటించిన విద్యార్థులనే పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల వెలుపల విద్యార్థులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేస్తారు.

తెచ్చుకోవాల్సినవి ఇవే..

- విద్యార్థులు ప్రింటవుట్ అడ్మిట్ కార్డుతో పాటు నీట్ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పాస్‌పోర్ట్ సైజుఫోటోను తమవెంట తెచ్చుకోవాలి. మరొక పాస్‌పోర్ట్ సైజు ఫోటోను ఎగ్జామినేషన్ హాల్లో విద్యార్థుల హాజరు నమోదు చేసే సమయంలో అటెండెన్స్ సీట్‌పై అతికించాల్సి ఉంది. దీంతో పాటు పోస్ట్‌కార్డ్ సైజు వైట్ బ్యాగ్రౌండ్‌తో కూడిన కలర్ ఫోటోను అడ్మిట్‌కార్డుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై అతికించి ఇన్విజిలేటర్‌కు అందజేయాలని నియమావళిలో పొందుపర్చారు. అదే విధంగా ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, 12వ తరగతి అడ్మిషన్ కార్డులో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. శారీరక వైకల్యం గల విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకెళ్లాలి. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. పరీక్ష రాసేందుకు అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రాల్లోనే ఇస్తారు.

నీట్ జరిగేది ఇలా...

- పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే ఒక్కొక్కరిగా లోపలికి పంపుతారు. మధ్యాహ్నం 1.30 వరకు అనుమతించిన తరువాత పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లను మూసివేస్తారు.
- పరీక్ష కేంద్రాల్లోకి వచ్చిన విద్యార్థులను మధ్యాహ్నం 1.15 గంటల నుంచి కేటాయించిన సీట్లలో కూర్చోబెడతారు.
- మధ్యాహ్నం 1.30 నుంచి ఇన్విజిలేటర్లు విద్యార్థుల అడ్మిట్ కార్డులను తనిఖీ చేసి, పరీక్ష రాసేందుకు పాటించాల్సిన ముఖ్యమైన నిబంధనలను తెలియజేస్తారు. తదుపరి మధ్యాహ్నం 2.00 గంటలకు ఖచ్చితంగా పరీక్షను ప్రారంభిస్తారు. విద్యార్థులను పరీక్ష పూర్తయ్యే వరకు బయటకు పంపరు.

విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

- ఎన్‌ఈపీ-2020 విధానాల అమలుకు సమష్టిగా చర్యలు
- సాంప్రదాయ కోర్సుకు నైపుణ్య లక్షణాలు జోడిస్తే ఉత్తమ ఉపాధి
- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- డిగ్రీ హానర్స్ కోర్సు అమలుపై సీడీసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, వేదికపై ఆచార్య వరప్రసాదమూర్తి తదితరులు

ఏఎన్‌యూ: విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఎన్‌ఈపీ (జాతీయ విద్యా విధానం) -2020 అమలుకు అనుబంధ కళాశాలలు కృషి చేయాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. ఎన్‌ఈపీ-2020లో భాగంగా ఏపీ ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన నాలుగు సంవత్సరాల డిగ్రీ హానర్స్ కోర్సు నిర్వహణపై యూనివర్సిటీ సీడీసీడీన్ (కళాశాల అభివృద్ధి మండలి) ఆధ్వర్యంలో గురువారం ఏఎన్‌యూలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ప్రస్తుతం కొనసాగుతున్న బీఏ, బీకం, బీఎస్సీ వంటి సాంప్రదాయ కోర్సులతోపాటు విద్యార్థికి ఉపాధి సంబంధిత నైపుణ్య లక్షణాలు పెంపొందిస్తే ఉత్తమ ఉపాధి అవకాశాలు పొందగలుగుతారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె మధుబాబులు మట్లాడుతూ ప్రస్తుతం డిగ్రీలో మూడు మెయిన్ సబ్జెక్టులు ఉండగా కొత్త విధానం ప్రకారం ఒక మెయిన్ సబ్జెక్టును ప్రధానంగా విద్యార్థి ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. హానర్స్ డిగ్రీ కోర్సులో మొదటి రెండు సంవత్సరాలు చదివి ముగిస్తే డిప్లొమా సర్టిఫికెట్, మూడు సంవత్సరాలకు మైనర్ డిగ్రీ, నాలుగు సంవత్సరాలు చదివితే హానర్స్ డిగ్రీ ఇవ్వబడుతుందన్నారు. నాలుగు సంవత్సరాల హానర్స్ కోర్సు 75 శాతం మార్కులతో ఉత్తీర్ణుడైన విద్యార్థి ఆసక్తి ఉంటే నేరుగా పీహెచ్‌డీ అడ్మిషన్ పొందవచ్చన్నారు. కళాశాలలన్నీ తాము ప్రధానంగా అమలు చేసే డిగ్రీ మేజర్ సబ్జెక్టులతో రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఈనెల 5వ తేదీలోగా తప్పకుండా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ అకడమిక్ డీన్ ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి , రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, ఏసీఈ ఆర్ ప్రకాశరావు ప్రసంగించారు.

విజయకీలాద్రిపై నృసింహ జయంతి



కల్యాణోత్సవంలో భాగంగా అలంకరించిన లక్ష్మీ నరసింహస్వామి, శ్రీదేవి భూదేవి

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై గురువారం నృసింహ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఆయురారోగ్య అభివృద్ధికి, దుష్ట గ్రహదోషాలు, నరదిష్టి, నరఘోష పరిష్కారాల నివారణార్థం నృసింహ యాగం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి తిరుమంజన సేవ, అలంకరణ, అష్టోత్తర శత నామార్చన, అనంతరం శ్రీదేవి భూదేవి, సమేత శ్రీ గోవిందరాజ స్వామి పెరుమాళ్లకు కల్యాణ మహోత్సవం నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయకీలాద్రి అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఇంటి స్థలాల అభివృద్ధి జరగాలి

సీఆర్‌డీఏ పరిధిపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: సీఆర్డీఏ పరిధిలోని తుళ్లూరు, మంగళగిరి మండలాల్లో అర్హులైన పేదలకు ఇచ్చే ఇంటి పట్టాలకు సంబంధించిన లేఅవుట్స్ ప్రక్రియ ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. రహదారులు, ప్లాట్స్ మార్కింగ్, అంతర్గత రోడ్లు, జంగిల్ క్లియరెన్స్ లాంటి పనులు వేగంగా జరగాలన్నారు. ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను, అభివృద్ధి పనులను సమీక్షిస్తూ ఇబ్బందులను గుర్తించాలన్నారు.

భూమిని త్వరలోనే అప్పగిస్తాం

భవాని ఐలాండ్ విస్తరణ కోసం ప్రతిపాదించిన 311.78 ఎకరాల భూమిని పరిశీలించి త్వరలోనే టూరిజం కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ సైడ్ ఎమినిటీస్ సెంటర్ ఏర్పాటుకు పొత్తూరు గ్రామంలో 3 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. అయితే దాంట్లో కొన్ని ఇబ్బందులున్న నేపథ్యంలో మరో ప్రత్యామ్నాయాన్ని చూస్తున్నామని చెప్పారు.

జర భద్రం బిడ్డా..

పులులు సంచరిస్తున్నాయి

- అప్రమత్తంగా ఉండండి
- అటవీ ప్రాంతానికి వెళ్లవద్దు
- అటవీశాఖ జిల్లా అధికారి రామచంద్రరావు



నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి దృశ్యం

మాచర్ల: దుర్గి అటవీ ప్రాంతంలో రెండు పులులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ జిల్లా అధికారి ఎస్.రామచంద్రరావు వెల్లడించారు. గురువారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లమల ప్రాంతం నుంచి పులులు దుర్గి అటవీ ప్రాంతానికి ఇవి వచ్చాయని, కాకిరాల ప్రాంతంలో పులులు సంచరిస్తున్నట్లు కాలి గుర్తుల ఆనవాలు ద్వారా కనుగొన్నామని తెలిపారు. పూర్తి స్థాయిలో వివరాలు తెలుసుకొని పులులను అటవీ ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు పులుల విషయంలో అటవీ ప్రాంతంలోని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. అటవీ ప్రాంతానికి జీవాలను తీసుకెళ్లవద్దన్నారు. ఆ పులులు మనుషులను తినేవి కావన్నారు. సమావేశంలో వినుకొండ ఫారెస్టు అధికారి సైద్ హుస్సేన్ పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

గజాపురం సందర్శన

దుర్గి: గురువారం మండల పరిధిలోని గజాపురం గ్రామాన్ని డీఎఫ్‌ఓ రామచంద్రరావు సందర్శించారు. కొన్ని రోజుల క్రితం గజాపురం అటవీ ప్రాంతంలో ఓ ఆవు పై పెద్ద పులులు దాడి చేసి మృతి చెందిన ఆవు కళేబరాన్ని రెండు రోజులుగా ఆహారంగా తీసుకున్న ఘటనపై గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వు ఫారెస్టు అరణ్యంలో దాదాపుగా 75 పెద్దపులులు ఉన్నట్లు నిర్ధారించామని, వాటిలో రెండు నుంచి మూడు పులులు పల్నాడు ప్రాంతంలో సంచరిస్తున్నాయని డీఎఫ్‌ఓ వెల్లడించారు.

అవగాహన కల్పిస్తున్నాం

బొల్లాపల్లి: నల్లమల అటవీ ప్రాంతం ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ వినుకొండ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పెద్దపులి సంచారంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వినుకొండ రేంజ్ పరిధిలో 44 వేల ఎకరాల మేర అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు.


పశుగ్రాసం ఏర్పాటు చేయాలి

గత వారం రోజులుగా తమ గేదెలు, ఆవులు, మేకల పశుగ్రాసం కొరకు పొలాలకు వెళ్లడం లేదని డీఎఫ్‌ఓకు దుర్గి మండలం గజాపురం గ్రామస్తులు వివరించారు. పెద్దపులి ఆవును చంపి వేసిన రోజు నుంచి భయంతో బతుకుతున్నామని, పశుగ్రాసం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మహబూబ్, సెక్షన్ ఆఫీసర్ వెంకయ్య, బీట్ ఆఫీసర్లు టి.వెంకయ్య, కె వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్లానింగ్' తప్పుతోంది!

అధికారుల తీరు.. రోజుకోమారు!

- మొన్న బస్టాండ్‌లో నోటీసులివ్వకుండానే కట్టడం కూల్చివేత
- సదరు వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం మెట్లెక్కిన కమిషనర్
- నిన్న ఏటీ అగ్రహారానికి ఫాతిమానగర్ అంటూ బోర్డులు
- పేరు మార్పు పై స్పందించిన నగర కమిషనర్ కీర్తి చేకూరి
- బోర్డుని వెంటనే తొలగించిన అధికారులు



గుంటూరు నగరం ఏరియల్ వ్యూ



బోర్డు తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు తలనొప్పిగా మారింది. రోజుకో వివాదంతో కార్పొరేషన్‌ను చిక్కుల్లో పడేస్తున్నారు. మొన్న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఓ వ్యాపారి స్థలాన్ని లీజుకు తీసుకుని వ్యాపారం నిర్వహించుకునే ఆర్టీసీ అధికారుల నుంచి అన్ని అనుమతులతో తాత్కాలిక రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఈ క్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు నిర్మాణం దగ్గరకు చేరుకుని నగరపాలక సంస్థ అనుమతి లేకుండా ఏలా నిర్మిస్తారంటూ ప్రశ్నించి, నోటీసులు ఇవ్వకుండానే ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. దీంతో సదరు వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరిని ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించడంతో ఆమె కోర్టుకు హాజరై వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

పేరు మార్చి.. వివరణ ఇచ్చి...

తాజాగా గురువారం ఏటీ అగ్రహారానికి ఫాతిమా నగర్ అంటూ సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏటీ అగ్రహారానికి ఫాతిమా నగర్ బోర్డులు ఏర్పాటు చేయడం ఏమిటంటూ నగరపాలక సంస్థ అధికారుల తీరుపై మండిపడ్డారు. దీనిపై నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పందించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో భాగంగా ప్రధాన వీధులకు నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించిన క్రమంలో ఏటీ అగ్రహారం పక్కనే ఉన్నటువంటి నోటిఫైడ్ స్లమ్‌లో ఫాతిమానగర్ వద్ద బోర్డు పెట్టాల్సిన ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అవగాహన లోపంతో ఏటీ అగ్రహారం వద్ద నేమ్ బోర్డు ఏర్పాటు చేశారని, నేమ్ బోర్డును వెంటనే తొలగించడం జరిగిందని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

కంటెమ్ట్ ఆఫ్ కోర్టు!

గత కొద్ది నెలల క్రితం జీటీ రోడ్డులో ఓ సినిమా థియేటర్‌ను ఆనుకొని నగరపాలక సంస్థ కచ్చా కాలువ ఒకటి ప్రవహిస్తుంది. దాని నిర్వహణను నగరపాలక సంస్థ సిబ్బంది సక్రమంగా పట్టించుకోకపోవడంతో తగిన ఆధారాలు చూపి సదరు కాలువను థియేటర్ యాజమాని పూడ్చివేయించి కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అయితే థియేటర్ పక్కనే ఓ వాణిజ్య కాంప్లెక్స్‌కు సదరు కాలువ వలన ఇబ్బందులు వస్తుండటంతో స్థానికులతో కలిసి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సహకారంతో సదరు కాలువను వాణిజ్య కాంప్లెక్స్ బిల్డర్ పగులగొట్టించారు. దీనిపై సదరు థియేటర్ యాజమాని కోర్టును ఆశ్రయించడంతో కంటెమ్ట్ ఆఫ్ కోర్టుగా అధికారులు కోర్టుకు హాజరు అవ్వాల్సిన పరిస్థితి వచ్చింది.

డొంకరోడ్డులో...

రెండు నెలల క్రితం డొంక రోడ్డు(శ్రీనగర్ మెయిన్ రోడ్డు)లో రోడ్డు విస్తరణ సమయంలో లబ్ధిదారులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారు ఆందోళన చేసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మేయర్, కమిషనర్ జోక్యం చేసుకుని ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులతో చర్చించి సమస్యను పరిష్కరించాల్సి వచ్చింది.

2016వ సంవత్సరంలో కొత్తపేట శివాలయం ఎదురుగా హాస్పటల్ భవన నిర్మాణ అనుమతుల్లో వ్యత్యాసం విషయంలో పట్టణ ప్రణాళిక అధికారులు హైకోర్టుకు తప్పుడు నివేదికలు సమర్పించడంతో అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ నాగలక్ష్మికి హైకోర్టు శిక్ష విధించింది. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయకపోతే మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టిన వారౌతారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటికే ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు పడగా, ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. తాజా వ్యవహారంలో మరికొందరిపై వేటు పడే అవకాశం కనపడుతోంది.

అవగాహనా లోపం వల్లే..



నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలోని ఏ.టి అగ్రహారం 2 వ లైను సమీప ప్రాంతానికి సంబంధించిన ఫాతిమా నగర్ సూచిక బోర్డును పట్టణ ప్రణాళిక క్రిందిస్థాయి సిబ్బంది అవగాహన లోపంతో ఏర్పాటు చేశారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు వెల్లడించారు. ఏ.టి అగ్రహారం, శ్రీరాంనగర్ పేర్లను మార్చుతున్నట్లు గురువారం సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని, నగర పాలక సంస్థ క్రింది స్థాయి సిబ్బంది అవగాహన లోపంతో చేసిన పనిని, ప్రశాంతమైన గుంటూరు నగరంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ఏ.టి అగ్రహారం సూచిక బోర్డును శుక్రవారం సాయంత్రంలోపు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించామన్నారు.

ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదు

పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

సాక్షి, అమరావతి: గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం పేరు మార్చినట్టు కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంత్రి ఖండించారు. జరిగిన పొరపాటును అధికారులు వెంటనే సరిదిద్దారని ఓ ప్రకటనలో తెలిపారు. ఏటీ అగ్రహారంలో ఫాతిమనగర్ పేరుతో బోర్డు ఏర్పాటు కాంట్రాక్టర్ అవగాహన లోపంతో జరిగిందని, దీనిని రాజకీయం చేయాలని చూడటం సరికాదన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కాంట్రాక్టర్ అవగాహన లేక ఫాతిమానగర్‌లో ఏర్పాటు చేయాల్సిన బోర్డును ఏటీ అగ్రహారంలో పెట్టారన్నారు. వివాదం మొదలవగానే కమిషనర్‌తో మాట్లాడానని, వెంటనే ఆ బోర్డును అధికారులు తొలగించారన్నారు. కాంట్రాక్టర్ అధికారుల సహకారం తీసుకొని ఉంటే ఈ తప్పిదం జరిగేది కాదన్నారు. దీనినికొందరు రాజకీయం చేయడం సరికాదని, లబ్ధిపొందాలని చూడటం దుర్మార్గమన్నారు.

ఏఎన్‌యూ, విజ్ఞాన్ మధ్య ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, విజ్ఞాన్ యూనివర్సిటీ(వడ్లమూడి) మధ్య ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదిరింది. ఏఎన్‌యూలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రఘునందన్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో ఎంఓయూలు మార్చుకున్నారు. పలు సాంకేతిక, వృత్తి విద్యాకోర్సులకు సంబంధించిన విద్య, బోధన, పరిశోధనాంశాలలో రెండు యూనివర్సిటీలు సంయుక్తంగా చర్యలు చేపట్టనున్నాయి. కార్యక్రమంలో ఏఎన్‌యూ సీడీసీడీన్ ఆచార్య కె.మధుబాబు, యూజీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీజే రత్నాకర్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి, విజ్ఞాన్ విద్యాసంస్థల అధికారులు ఆచార్య విజయరాము, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.

దూరవిద్యా కేంద్రంలో సైకాలజీ తరగతులు ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకాలజీ పీజీ డిప్లొమా కోర్సు తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు తరగతుల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజీ కోర్సు పూర్తి చేసిన వారికి విరివిగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

విజ్ఞానమే విలువైన ఆస్తి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, లాలుపురం రాము, ఆర్జేడీ సుబ్బారావు, దేవానంద్ తదితరులు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విజ్ఞానమనే విలువైన ఆస్తితోనే మానవ జీవన విధానం సమూలంగా మారి ఆర్థిక అసమానతలు తగ్గుముఖం పడతాయని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి వచ్చే నెల 11 వరకు జరగనున్న వేసవి విజ్ఞాన శిబిర బ్రోచర్‌ను గురువారం బృందావన్ గార్డెన్స్‌లో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ బాలల్ని రేపటి ఉత్తమ పౌరులుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అకుంఠిత దీక్షతో ముందుకు వెళతున్నారని వివరించారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాల్ని మరింత అధునాతనంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల మెదడుకు మేత అందించేందుకే విజ్ఞాన శిబిరానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథపాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, ఉద్యోగులు ఎం.సీతారామయ్య, కె.చిన్నపరెడ్డి, నంద్యాల నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, జి.రాజేష్, టి.విజయ్ కుమార్, సంజయ్ పాల్గొన్నారు.

కేవీకేల కార్యాచరణపై రాష్ట్రస్థాయి సమావేశం



ఏటీఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎస్.మీరాను సన్మానిస్తున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల కార్యాచరణ ప్రణాళికపై గురువారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఆడిటోరియంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్ (ఏటీఏఆర్ఐ జోన్ 10) సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని, అందుకు విశ్వవిద్యాలయం దోహదపడిన తీరును వివరించారు. విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన ఫలితాలను రైతులకు అందుబాటులోకి తీసుకెళ్లటానికి, వారి నికర ఆదాయం పెంచి, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విస్తరణ శాస్త్రవేత్తలకు సూచించారు. ఏటీఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎస్.మీరా మాట్లాడుతూ నూతన పరిశోధనలు, వంగడాలు, యాజమాన్య పద్ధతులు రైతులకు చేరవేయటంలో అపార సేవ చేస్తున్న కేవీకేల కృషిని కొనియాడారు. విస్తరణ కార్యక్రమాలు రైతులకు మరింత చేరువ చేసేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏటీఏఆర్ఐ డైరెక్టర్‌ను వీసీ ఘనంగా సన్మానించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఇ.కరుణశ్రీ, డాక్టర్ జి.వెంకట నాయుడు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మార్చి 2న వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ద్వారా డెంటల్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, సైకాలజిస్టు, మల్టీరీహాబిలిటేషన్ వర్కర్స్, ఆడియో మెట్రీషియన్, న్యూట్రిషియన్ కౌన్సెలర్, ఫిజియోథెరపిస్టు, స్టాఫ్‌నర్సు, హాస్పిటల్ అటెండెంట్, శానిటరీ అటెండెంట్, అటెండర్, క్లీనర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో అభ్యంతరాలు పరిశీలించి ఫైనల్ మెరిట్ లిస్టును తయారు చేశామని ఆయన పేర్కొన్నారు. లిస్టులో క్లరికల్, టైపోగ్రాఫికల్ మిస్టేక్స్ ఉంటే ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లో కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. లిస్టు గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

6న వేళంగిణికి ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: గుంటూరు- 2 డిపో నుంచి తమిళనాడు నాగపట్నంలోని వేళంగిణి యాత్రకు రెండు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు మేనేజరు షేక్ అబ్దుల్ సలామ్ గురువారం ప్రకటనలో తెలిపారు. బస్సులు ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు బస్టాండ్ నుంచి బయలుదేరతాయని పేర్కొన్నారు. 7న వేళంగిణిలో దివ్య బలి పూజ చూసుకొని అక్కడే బస ఉంటుందన్నారు. 8న మధ్యాహ్నం చెన్నైలోని సెయింట్ థామస్ మౌంట్(పరిశుద్ధ థామస్ వారి సమాధి), మెరీనా బీచ్ సందర్శనం తరువాత తిరుగు ప్రయాణం ఉంటుందని వివరించారు. ఒక్కో టికెట్ ధర రూ. 3300 ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. సమాచారం కోసం 9959225421లో సంప్రదించాలని సూచించారు.

నందికుంట విఘ్నేశ్వర ఆలయంలో చోరీ



దుండగుడు ధ్వంసం చేసిన హుండీ

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక ఆలయమైన నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ తులసీదాస్ తెలిపిన వివరాల మేరకు.. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయంలో పూజలు, అభిషేకాలు, ప్రసాదాల వితరణ జరుగుతుంది. బుధవారం రాత్రి 9 గంటల వరకూ పూజారి పరాంకుశం సురేష్, గ్రామస్తులు కోటపాటి నాగార్జున పూజలు ముగించి ఆలయం తలుపులకు తాళాలు వేసి వెళ్లారు. తెల్లవారుజామున భక్తులు పూజలు నిర్వహించేందుకు రాగా, తలుపు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. ఈవో తులసీదాస్, గ్రామపెద్దలు ఆలయాన్ని పరిశీలించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి 2.30 నుంచి 2.45 గంటల మధ్యలో చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగుడు తలకు టోపీ, మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి చేతిలో రాడ్డు తీసుకుని వచ్చి ముందుగా ప్రధాన ద్వారం తలుపు పగలగొట్టి లోనికి ప్రవేశించి, అనంతరం హుండీ తాళాలు పగలగొట్టాడు. హుండీలోని నగదును చోరీ తీసుకెళ్లాడు. సంఘటనపై ఈవో తులసీదాస్ పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీ ఫుటేజీని అందించారు. ఎస్సై భాస్కర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. చోరీకి గురైన సొమ్ము రూ.75-80 వేల వరకూ ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

గంగమ్మతల్లి ఆలయంలో చోరీ

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని తొండపి వెళ్లే దారిలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో గురువారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. హుండీని పగలకొట్టారు. ఆలయంలోనూ వెతుకులాట చేపట్టారు. ఈ సంఘటనలో హుండీలో ఏమీ లేకపోవటంతో దాన్ని పక్కనే ఉన్న పొలాల్లో వదిలేసి వెళ్లారు. గంగమ్మ తల్లి వార్షికోత్సవం ఉండటంతో ఆలయంలోని హుండీని గ్రామస్తులు బుధవారం ఖాళీ చేశారు. మరో పెద్ద బోషాణాన్ని కూడా గడ్డపారతో పగలకొట్టారు. సమాచారం అందుకున్న ముప్పాళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరి క్లూస్ టీమ్ ద్వారా వివరాలు సేకరించారు.

మ్యాట్రిమోనీ సైట్లను నమ్మిమోసపోవద్దు

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: మ్యాట్రిమోనీ సైట్లను నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మ్యాట్రిమోనీ మోసాల గురించి వివరించారు. ప్రస్తుత కాలంలో ఒకరి అభిరుచుల స్థాయికి తగినట్లుగా నచ్చిన భాగస్వామిని ఎంచుకునేందుకు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు సరైన వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. లక్షలలో ఒకరిని ఎంచుకొనే సందర్భాలలో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ఉంచిన ప్రొఫైల్స్ చూసి విదేశీ సంబంధం, లైఫ్ సెటిల్ అయిపోతుందని భావించి కొందరు మహిళలు పరిచయం లేని వ్యక్తులతో పరిచయం పెంచుకొని మోసపోతున్నారని తెలిపారు. బాగా చదువుకున్నవారు, పట్టణ ప్రాంతంలో నివసించే వారే ఎక్కువ మోసపోతున్నారని చెప్పారు. ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదికలలో పేరు నమోదు చేసుకున్న మహిళలనే లక్ష్యంగా చేసుకొని మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లలో ఆడపిల్లల తల్లిదండ్రుల బలహీనతలను నేరగాళ్లు తమ పెట్టుబడిగా మార్చుకుంటున్నారన్నారు. విదేశీ సంబంధం అంటూ కొందరు కేటుగాళ్లు నకిలీ ప్రొఫైల్స్ అప్‌లోడ్ చేసి మొదట పరిచయం చేసుకుని, వివిధ రూపాల్లో దొరికినంత దోచుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకోవడం, పెళ్లయ్యాక వారి నుంచి నగదు, నగలు వసూలు చేసి పరారవ్వడం ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా తెలిసే విదేశీ సంబంధాలను ముందు వెనుక చూడకుండా చేసుకుని మోసపోవద్దని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు స్ఫూర్తి కలిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు, సురేష్

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు స్ఫూర్తి కలిగించాలని రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ విభాగపు థిమాటిక్ లీడ్ విశ్వేశ్వరరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులు సాధిస్తున్న సత్ఫలితాలు, విజయ గాథల్ని వివిధ మాధ్యమాల ద్వారా సమాజానికి తెలియజేయాలని సూచించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెంటార్స్‌కు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం ఐదో రోజు గురువారం ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం అమలులో కమ్యూనికేషన్(సమాచార వ్యవస్థ) అత్యంత కీలకం అని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా రైతుల్ని ప్రభావం చేసే విధంగా విజయ గాథల్ని రూపొందించాలని సూచించారు. ఫోటో కేస్ స్టడీస్‌ను కూడా తయారు చేసి వాట్సప్ ద్వారా కూడా ఎంతో మందికి చేరవేయవచ్చని తెలిపారు. మరో థిమాటిక్ లీడ్ సురేష్.. కేస్ స్టడీస్ (విజయ గాథలు) తయారీ, అందులోని అంశాలు, డేటా, విజయ గాథల జోడింపు, ఫొటోల నాణ్యత, రైతుల మనోభావాలు తదితర విషయాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల సమీకృతం, చైతన్యం, యాజమాన్య బాధ్యతలు తదితర అంశాలపై మెంటార్లకు థిమాటిక్ లీడ్‌లు అరుణ, జేబీఆర్ చక్రవర్తి క్షుణ్ణంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎన్నో రకాల జీవనోపాదుల్ని సృష్టించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు ముందు, తర్వాత కూడా ఎన్నో ఉత్పత్తి ఆధారిత ప్రోడక్ట్స్ తయారు చేసి విలువను జోడించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఆరోగ్య విభాగపు ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాల సేకరణ

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



ఈమనిలో పంటను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

తాడేపల్లి రూరల్: జిల్లావ్యాప్తంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాల్ని సేకరిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. దుగ్గిరాల మండల పరిధిలోని చినపాలెం, ఈమని గ్రామాల్లో గురువారం ఆయన పంటల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో వారం రోజుల వర్షాలు కురవనున్న దృష్ట్యా జొన్న, మొక్కజొన్న కోసిన రైతులు పంటల్ని తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. పొలాల్లో జొన్న, మొక్కజొన్న కంకులు నేలకు ఒరిగాయని, వాటి వివరాల్ని రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సిబ్బందితో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీటీటీసీ సెంటర్ శాస్త్రవేత్త నగేష్, తెనాలి సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె. వెంకటరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శిరీష్, చినపాలెం సర్పంచ్ పి. ప్రదీప్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎ. రమేష్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

నగటున 16.3 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): ఉపరితల ద్రోణి ప్రభావంతో గుంటూరు జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 75 మి.మీ. పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1.4 మి.మీ. పడింది. సగటున 16.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం

ప్రత్తిపాడు 50.4 మి.మీ., దుగ్గిరాల 41.2, వట్టిచెరుకూరు 24.6, తెనాలి 23.8, మంగళగిరి 15, పెదకాకాని 13, చేబ్రోలు 12.2, గుంటూరు పశ్చిమ 8.8, కొల్లిపర 6.4, పెదనందిపాడు 5.6, ఫిరంగిపురం 4.6, తాడేపల్లి 4.6, గుంటూరు తూర్పు 3, తుళ్లూరు 2, పొన్నూరు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

2,220.61 హెక్టార్లలో పంటలకు నష్టం

ఇప్పటి వరకు 2,220.61 హెక్టార్లలో మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తెనాలి మండలంలో 688 హెక్టార్లలో మొక్కజొన్న, 224 హెక్టార్లలో జొన్న పంటకు నష్టం వాటిల్లింది. దుగ్గిరాల మండలంలో 160 హెక్టార్లలో మొక్కజొన్న, 200 హెక్టార్లలో జొన్న, కొల్లిపర మండలంలో రెండు హెక్టార్లలో జొన్న, చేబ్రోలు మండలంలో 80 హెక్టార్లలో మొక్కజొన్న, 328.4 హెక్టార్లలో జొన్న, మంగళగిరి మండలంలో 10 హెక్టార్లలో జొన్న, తాడేపల్లి మండలంలో 7.2 హెక్టార్లలో జొన్న, పెదకాకాని మండలంలో 22.4 హెక్టార్లలో మొక్కజొన్న, 174 హెక్టార్లలో జొన్న, తుళ్లూరు మండలంలో 1.61 హెక్టార్లలో మొక్కజొన్న, వట్టిచెరుకూరు మండలంలో 66 హెక్టార్లలో మొక్కజొన్న, 85 హెక్టార్లలో జొన్న, ప్రత్తిపాడు మండలంలో 80 హెక్టార్లలో మొక్కజొన్న, గుంటూరు రూరల్ మండలంలో 10 హెక్టార్లలో జొన్న, కాకుమాను మండలంలో 80 హెక్టార్లలో జొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. తాడేపల్లి మండలంలో ఆరు హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియా ఆల్మస్ ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన సాదియా ఆల్మస్ (మధ్యలో)

మంగళగిరి: నగరానికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మస్ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఘన విజయం సాధించింది. కేరళలో ఈనెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కేజీల విభాగంలో ఆమె భారతదేశం తరపున పాల్గొని మూడు బంగారు పతకాలు, ఒక బ్రాంజి మెడల్ సాధించినట్లు కోచ్ ఎస్కే సంధాని తెలిపారు. నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ సాదియా ఆల్మస్ స్క్వాట్ 190 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, బెంచి ప్రెస్ 77.5 కేజీల విభాగంలో బ్రాంజి మెడల్, డెడ్‌లిఫ్ట్ 160 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పోటీల్లో 190 కేజీల బరువు ఎత్తి ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నూతన రికార్డు నెలకొల్పి ఓవరాల్ బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ సంధాని తెలిపారు. ఈ సందర్భంగా సాదియాను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, సెక్రటరీ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సకల కోటేశ్వరరావు, గుమ్మడి పుల్లేశ్వరరావు అభినందించారు.

జాగ్రత్తలతో వరి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చు

- వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను నమోదు చేయండి
- జిల్లా వ్యవసాయాధికారి మురళి, డాట్ శాస్త్రవేత్త రమేష్



దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మురళి, డాట్ శాస్త్రవేత్త రమేష్

నరసరావుపేట: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను తగిన జాగ్రత్తలు తీసుకుంటే కొంతమేర నష్టాన్ని నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, డాట్ శాస్త్రవేత్త రమేష్ రైతులకు సూచించారు. వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న వరిపంటను వీడియో, ఫొటోలు తీసి రైతు పేరును నమోదుచేయాల్సిందిగా వ్యవసాయాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన శాస్త్రవేత్త రమేష్‌తో కలిసి నకరికల్లు మండలంలోని దేచవరం, చల్లగుండ్ల గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. మురళి మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లాలో 58,810 సాధారణ హెక్టార్లకు గాను 58,872 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారన్నారు. వర్షాలకు కోతకు వచ్చిన వరి దెబ్బతిన్నట్లు తెలిపారు. వర్షాల వలన వరిపంట నేలవాలిందన్నారు. పూర్తిగా దెబ్బతిన్న పంటలను వీడియా, ఫొటోలు తీసి రైతు పేరును నమోదుచేయాలని పిడుగురాళ్ల వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారిని కోరామన్నారు. శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ ఈ పరిస్థితిలో వరి రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలంలో నిల్చిన నీటిని వెంటనే బయటకు పంపాలన్నారు. కోతకోసిన పనలు వర్షానికి మొలకెత్తకుండా ఉండేందుకు ఒక లీటరు నీటికి 50గ్రాముల ఉప్పుకలిపి పిచికారి చేయాలన్నారు. పొలంలో నీరు లేకపోతే మడిలోనే ఉప్పునీరు చల్లాలన్నారు. నూర్పిన ధాన్యం తడిస్తే గింజ మొలకెత్తడమే కాకుండా రంగుమారి చెడువాసన వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఒక క్వింటాలు ధాన్యానికి ఒకకేజీ ఉప్పు, 20కేజీల పొడి ఊక కలిపి ధాన్యంకు పోగు పెట్టడం వలన గింజ మొలకెత్తకుండా కాపాడుకోవచ్చన్నారు.

పదిలోగా ఈకేవైసీ చేయించుకోవాలి

నరసరావుపేట: జిల్లాలోని ఉపఖజానా ద్వారా పింఛన్ పొందుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారులు ఈనెల పదో తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి స్వామినాథన్ గురువారం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి పింఛన్‌దారు విధిగా సీఎఫ్ఎంఎస్ ఐడీలను వారి ఆధార్‌కు అనుసంధానించబడిన మొబైల్ నంబరుతో పదోతేదీలోపు అనుసంధానించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లబ్ధిపొందే పింఛన్‌దార్లందరూ ప్రభుత్వం నుంచి లభించే సేవలు పొందేందుకు వివరాలు తెలుసుకునేందుకు ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. దీనికోసం ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు తప్పనిసరి అన్నారు. ప్రతి పింఛన్‌దారు ఉపఖజానా కార్యాలయం లేదా హెర్బ్ యాప్‌లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.